

టీబీ డ్యాంలో 67.47 టీఎంసీలు



జలకళతో తుంగభద్ర జలాశయం

- ఎగువ నుంచి 65,187 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- జూలై 10న నుంచి ఎల్లెల్సీ సాగునీటి కోసం కర్ణాటక ఇండెంట్
- ఆ రోజు నుంచే ఏపీకి కూడా ఇచ్చే అవకాశం
- వచ్చే నెల మొదటి వారంలో ఐఏబీ సమావేశంలో కీలక నిర్ణయం

ఎల్లెల్సీ ఆయకట్టు రైతులకు తీపి కబురు. తుంగభద్ర జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఇప్పటికే 67.47 టీఎంసీలు వరద చేరింది. 65,187 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గతేడాది కొట్టుకుపోయిన గేటు మరమ్మతులు, మిగిలిన 32 గేట్లు కూడా బాగా దెబ్బతినడంతో ఈ నీటి సంవత్సరంలో 80 టీఎంసీలు నిల్వ చేయాలని నిపుణుల కమిటీ సూచనతో టీబీపీ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 10న నుంచి సాగునీరు ఇవ్వాలని కర్ణాటక ప్రభుత్వం శుక్రవారం జరిగిన ఐసీసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. అదే రోజు నుంచే ఏపీ వాటా కూడా తీసుకోవడానికి ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు వచ్చే నెల మొదటి వారంలో జరిగే జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు.

కర్నూలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పశ్చిమ ప్రాంతం కరువు పల్లెసీమలకు తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) జీవనాడి. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్‌లో 43,519 ఎకరాలు, రబీలో 1,07,615 ఎకరాలు కలిపి 1,51,134 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. గత ఏడాది ఆగస్టులో 19వ నంబరు గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ గేటు స్థానంలో నూతన గేటు ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అదే క్రమంలో మిగిలిన 32 గేట్లు కూడా అధ్వానంగా మారాయని, 45-50 శాతానికి పైగా తుప్పు పట్టాయని క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చింది. ఆ గేట్లను కూడా మార్చేసి కొత్త గేట్లు ఏర్పాటు కోసం రూ.60 కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. అదే క్రమంలో 2025-26 నీటి సంవత్సరంలో 80 టీఎంసీలకు మించి నిల్వ చేస్తే డ్యాం భద్రతమే ముప్పు తప్పదని నిపుణుల కమిటీ సూచన మేరకు 80 టీఎంసీలే నిల్వ చేయాని తుంగభద్ర బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త గేట్లు ఏర్పాటు కోసం డిసెంబరు ఆఖరు నాటికి డ్యాం 1616 అడుగుల (సిల్ లెవల్) దిగువకు నీరు తగ్గించాల్సి ఉంది. దీంతో ఈ నీటి సంవత్సరంలో 120 టీఎంసీలు మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉందని ఈ నెల 11న జరిగిన టీబీపీ వాటర్ రివ్యూ కమిటీ వర్చువల్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆమేరకు కేడబ్ల్యూడీటీ-1 అవార్డు దమాషా ప్రకారం మూడు రాష్ట్రాలకు పంపిణీ చేశారు.



డ్యాంలో చేరిన 67.47 టీఎంసీలు

తుంగభద్ర డ్యాం గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.782 టీఎంసీలు కాగా.. ఆదివారం నీటి లెక్కలు పరిశీలిస్తే 67.47 టీఎంసీలు వరద చేరింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు 65,187 క్యూసెక్కులు (రోజుకు సగటున 5.5 టీఎంసీలు) వరద వచ్చి చేరుతుంది. ఈ వరద పెరిగే అవకాశం ఉందని డ్యాం ఇంజనీర్లు తెలిపారు.

ఐఏబీ సమావేశం నిర్ణయం మేరకు ఇండెంట్ ఇస్తాం





తుంగభద్రకు ఆశాజనకంగా వరద వచ్చి చేరుతోంది. ఇప్పటికే 67.47 టీఎంసీలు చేరింది. వచ్చే నెల 10 నుంచి ఎల్లెల్సీకి నీటి విడుదల కోసం కర్ణాటక ఇండెంట్ ఇప్పటికే ఇచ్చింది. ఆ రోజు నుంచే మనం కూడా ఇచ్చే అవకాశం ఉంది. అయితే.. జూలై మొదటి వారంలో జరిగే ఐఏబీ సమావేశంలో తీసుకునే నిర్ణయం మేరకు ఇండెంట్ ఇస్తాం.

\- బాలచంద్రారెడ్డి, ఎస్ఈ, జలవనరుల శాఖ, కర్నూలు సర్కిల్

జూలై 10 నుంచి ఎల్లెల్సీ సాగునీరు:

తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) ద్వారా ఎగువన కర్ణాటక, దిగువన ఎల్లెల్సీ వాటాను కలిపి తీసుకోవాలి. 0/0 నుంచి 130 కిలో మీటర్లు వరకు పూర్తిగా కర్ణాటకలో ప్రవహిస్తుంది. దీంతో ఆ రాష్ట్రం ఇండెంట్ ఇవ్వకుండా మన నీటివాటాను తీసుకుంటే ఆ నీరంతా కర్ణాటక రైతులే వాడేసుకునే అవకాశం ఉంది. అదే జరిగితే మనం నష్టపోతాం. దీంతో కర్ణాటక ఇండెంట్‌తో పాటుగానే ఎల్లెల్సీకి ఏపీ వాటా ఇండెంట్ ఇంజనీర్లు ఇస్తున్నారు. జూలై 10 నుంచి డ్యాం నుంచి నీటిని ఇవ్వాలని శుక్రవారం జరిగిన కర్ణాటక ఐసీసీ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంతో పాటు టీబీపీ బోర్డుకు ఇండెంట్ కూడా ఇచ్చినట్లు బోర్డు అధికారులు తెలిపారు. వచ్చే నెల మొదటి వారంలో జరిగే ఐఏబీ సమావేశంలో నీటి విడుదలపై నిర్ణయం తీసుకొని 10వ తేది నుంచే ఎల్లెల్సీకి నీటి విడుదలకు ఇండెంట్ ఇచ్చేందుకు ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. 7న ఐఏబీ సమావేశం జరగవచ్చని అంటున్నారు. మంత్రి, ఎమ్మెల్యేల నిర్ణయం మేరకు వాయిదా పడితే.. సాగు, తాగునీటి అవసరాలు దృష్ట్యా ఇండెంట్ ఇవ్వమని జిల్లా కలెక్టరు పి. రంజిత్‌బాషా జలవనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తుంది.

ముగిసిన సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలకు సంబంధించి సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్ ఆదివారం ముగిసింది. ఎస్బీఐ కాలనీలో జరిగిన కౌన్సెలింగ్‌కు కర్నూలు నగరపాలక సంస్థతో పాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు మున్సిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీకి సంబంధించిన ప్లానింగ్ సెక్రటరీలు, అమ్యూనిటీస్ సెక్రటరీలు హాజరయ్యారు. ప్లానింగ్ సెక్రటరీలు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు 157 మంది, రిక్వెస్ట్ చేసుకున్న వారు 22 మంది, అదే విధంగా అమ్యూనిటీస్ సెక్రటరీలు ఐదేళ్లు పూర్తి చేసుకున్నా వారు 170 మంది, రిక్వెస్ట్ చేసుకున్న వారు 20 మంది తమకు కావాల్సిన సచివాలయాల కోసం ఆప్షన్ ఇచ్చారు. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, డోన్ కమిషనర్ సుబ్బరాయుడు, గూడూరు కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకు దరఖాస్తులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ కె. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి 14,582 పోస్టుల భర్తీకి ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకటన ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు హెచ్‌టీటీపీ://ఎస్ఎస్‌సీ.జీవోవి.ఇన్‌లో చూడాలని ఆయన తెలిపారు. జూలై 4వ తేదీ వరకు అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏపీలో ఈపరీక్ష 24-7-2025 నుంచి 04-08-2025 వరకు జరుగుతుందన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అధికారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్ సైట్‌లో వారీ అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రభుత్వ మోసాలను ఎండగట్టాలి

- వైసీపీ రాయలసీమ రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని మాజీ మంత్రి, వైసీపీ రాయలసీమ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వైసీపీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం కర్నూలు నగరంలోని లక్ష్మీకల్యాణ మండపంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా పరిశీలకుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి, మంత్రాలయం, ఆలూరు ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, విరూపాక్షి హాజరయ్యారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు అమలు చేయలేని హామీలతో ప్రజలను నమ్మించారని, ఇంటింటికీ హామీల బాండ్లు పంపించి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. హామీలు నెరవేర్చాలని కోరితే మక్కెలు విరగ్గొడతామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారని, ఆయనకు ప్రజలే గట్టి సమాధానం చెబుతారని అన్నారు. 'బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ' అనే నినాదంతో ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్వీ మాట్లాడుతూ ఒక్కో ఇంటికి రూ.2.40 లక్షలు జమ అవుతాయంటూ బాండ్లు ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నారని వ్యాఖ్యానించారు. ఏడాదిలోనే ఈ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎంపీ, ఎమ్మిగనూరు ఇన్‌చార్జి బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్య ప్రవేశాలకు గడువు పొడిగింపు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం-2009 సెక్షన్ 12(1)సి ప్రకారం ఒకటో తరగతిలో ఉచిత అడ్మిషన్ కింద మొదటి విడతలో మిగిలిన సీట్ల కోసం రెండో విడత లాటరీ ద్వారా 173 పాఠశాలలో 1,056 మంది విద్యార్థులకు సీట్లు అలాట్ అయ్యాయని, వీటిలో చేరడానికి జూలై 2వ తేదీ వరకు గడువు పొడిగించామని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ ఆదివారం తెలిపారు. ఇప్పటి దాకా ఉచిత అడ్మిషన్లు పొందని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఖరీఫ్ పంటలకు బీమా

- ఉత్తర్వులు జారీ
- రైతులంతా వినియోగించుకోవాలని జేడీ విజ్ఞప్తి



కర్నూలు అగ్రికల్చర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో ఆరున్నర లక్షల ఎకరాల్లో పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు అకాల వర్షాలు, తెగుళ్ల, క్రిమికీటకాలు పంటలను కబళిస్తున్నాయి. ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి రైతులు సాగు చేసిన ఈ పంటలు చేతికందే సమయంలో పంటలన్నీ వర్షాభావం వల్లనో, భారీ వర్షాలు, తెగులు, క్రిమికీటకాల వల్లనో మట్టిలో కలిసిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులకు బీమా కంపెనీల నుంచి నష్టపరిహారాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కర్నూలు జిల్లాలో 11 పంటలు, నంద్యాల జిల్లాలో 12 పంటలకు బీమాను వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పత్తి, వేరుశనగకు మండల యూనిట్‌గా బీమా పథకాన్ని వర్తింపజేయనున్నారు. పత్తికి ఒక హెక్టారుకు రూ.లక్ష బీమాను వర్తింపజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా పోను రైతులు ఒక హెక్టారుకు రూ.5వేలు చెల్లించాలి. వేరుశనగకు రూ.70వేల బీమాను నిర్ణయించారు. ఒక హెక్టారుకు రూ.1,400 రైతులు ప్రీమియంగా చెల్లించాలి. అదే విధంగా వరికి రూ.లక్ష బీమా మొత్తాన్ని ఒక హెక్టారుకు నిర్ణయించి రూ.200 ప్రీమియంగా నిర్ణయించారు. అదే విధంగా మొక్కజొన్నకు రూ.32,500 బీమా మొత్తం కాగా, హెక్టారుకు రూ.155 రైతులు కట్టాల్సిన ప్రీమియాన్ని నిర్ణయించారు. కందికి బీమా మొత్తం రూ.55వేలుగా నిర్ణయించి రైతులు ప్రీమియంగా రూ.110 చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది. ఎండుమిర్చి ఒక హెక్టారుకు రూ.2.25 లక్షల మొత్తాన్ని బీమా మొత్తంగా నిర్ణయించి ఒక హెక్టారుకు రూ.900 చెల్లించాలని ఉత్తర్వులో పేర్కొంది. . జొన్న రూ.47,500కు గాను రూ.95, ఆముదం రూ.45వేల బీమా మొత్తానికి రూ.90 ప్రీమియంగా చెల్లించాలి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఈ ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వాతావరణ బీమా, ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు ఏటా రెండు సీజన్లలో పంటలు కోల్పోయి నష్టపోతున్నారు. ఈ నష్టాన్ని నివారించేందుకే ప్రభుత్వం బీమా పథకాలను అమలు చేస్తుంది. రైతులందరూ ఈ ప్రీమియం చెల్లించి బీమా పథకం ద్వారా లబ్ధి పొందాలి.

\- వరలక్ష్మి, జేడీ

శ్రీశైలంలో భక్తుల రద్దీ



క్యూలో నిల్చున్న భక్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజామునే భక్తులు కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన స్వామి అమ్మవార్ల దర్శనం కోసం తెల్లవారుజామునుంచే క్యూలైన్‌లలో బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు



స్వర్ణ రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహరించారు. ఆదివారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల, విద్యుత్ దీపాల మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాద రాయలను ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఊంజల సేవ నిర్వహించారు. మఠం పండితులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శ్రీమఠం అధికారులు మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతి ఆచార్, సురేష్ కోణాపూర్‌లు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

ప్రసాదాల తయారీపై ఆందోళన వద్దు

- లడ్డూలో బొద్దింక వచ్చిందన్న భక్తుడి ఆరోపణల్లో నిజం లేదు
- శ్రీశైలం ఈవో శ్రీనివాసరావు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులకు విక్రయిస్తున్న ప్రసాదాల తయారీలో ఎలాంటి ఆందోళన వద్దని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు భక్తులకు సూచించారు. లడ్డూలో బొద్దింక వచ్చిందంటూ ఆదివారం ఓ భక్తుడు చేసిన ఆరోపణలో నిజం లేదని ఈవో వివరణ ఇచ్చారు. ఈవో మాట్లాడుతూ దేవస్థానంలో చేసే అన్ని ప్రసాదాలు ఆలయ సాంప్రదాయాలకు అనుగుణంగా, పూర్తి నియమ నిష్ఠలతో తయారు చేస్తామన్నారు. నాణ్యతలో ఎలాంటి రాజీపడకుండా సీసీ కెమెరాల నిఘాతో అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. లడ్డూపోటును ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని చెప్పారు. గతంలో ఇలాగే ఆరోపణలు వస్తే అవాస్తవమని నిర్ధారించినట్లు తెలిపారు. క్షేత్ర ప్రతిష్ఠతను, భక్తుల మనోభావాలను భంగపరిచే విధంగా అవాస్తవాలు చేయడం తగదని, అధికారులకు మనోవేదనను కలుగజేస్తాయని అన్నారు.



మారకపోతే మార్చేస్తాం
ఉమ్మడి జిల్లాలో పలువురు ఎమ్మెల్యేల పనితీరు బాగా లేదు
టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు
యువకుడి దారుణ హత్య
7

ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అవార్డు



అవార్డును అందుకుంటున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు బి.క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌కు బెస్ట్ ప్రిన్సిపాల్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు ప్రదానం చేశారు. ఆదివారం హైదరాబాదులోని సువరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ హాలులో ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ అవార్డును అందుకున్నారు. నీతి అయోగ్ ద్వారా అక్రిడిటేషన్, అఫిలియేషన్ పొందిన ఏసి యా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్, రీ సెర్చ్ స్ఫూర్తి అకాడమీ వారు విద్యా రంగంలో విశిష్ట సేవలు అం దించినందుకు గానూ ఈ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెన్నారెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఈ రామచంద్రారెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ ముగిసింది. ఆదివారం జిల్లా పరిషత్ ఆవరణలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన కౌన్సెలింగ్ పీఆర్ ఎస్ఈ వి. రామచంద్రారెడ్డి, ఆదోని ఈఈ వెంకటేశ్వర్లు, నంద్యాల ఈఈ రఘురాంరెడ్డి, డీఈఈలు రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు నిర్వహించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ ద్వారా అడిగిన సచివాలయాలను కేటాయించారు. 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు 477 మంది ఉండగా రిక్వెస్ట్ కింద 25 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి చిన్నారులను తీసుకుని తల్లులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఆవరణలోని పార్కులో తల్లులు తమ బిడ్డలను ఉయ్యాలలో వేసి సేదతీర్చారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లకు..



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ తులసీదేవి

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు శివారులోని జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు తులసీదేవి ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, ఏఎస్‌డబ్ల్యూవోలు మద్దిలేటి, బాబు, వార్డెన్లు, కార్యాలయ సిబ్బంది కౌన్సెలింగ్‌కు హాజరైన ఉద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలించారు. అధిక సంఖ్యలో ఉమ్మడి జిల్లాలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు హాజరు కావడంతో కళాశాల ప్రాంగణం రద్దీగా కనిపించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కౌన్సెలింగ్‌కు ఉద్యోగుల మినహా ఇతరులను ఎవరినీ లోపలికి అనుమతించలేదు. సాయంత్రం 7 గంటల వరకు 556 మంది ఉద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలించి వారు కోరుకున్న స్థానాలను అలాట్ చేశారు. ఒకే స్టేషన్‌లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులు 570 మంది, ఐదు సంవత్సరాలు పూర్తి కానీ వారు 131 మంది ఉద్యోగులు బదిలీ కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కౌన్సెలింగ్ హాలులో స్క్రీనింగ్‌పై ఖాళీలను డిస్‌ప్లే చేసి ఉద్యోగులకు ఎంపిక ప్రక్రియను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవోలు లీలావతి, సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ ఉద్యోగులు, ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ఉద్యోగులు ఉన్నారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి

ఐనేకల్లు గ్రామంలో మొహర్రం వేడుకల వివాదం..



సుంకన్న



లక్ష్మన్న

ఆదోని రూరల్/ ఆస్పరి, జూన్ 29 ఆంధ్రజ్యోతి): ఆస్పరి మండలంలోని ఐనేకల్లు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు దాడిచేసి గాయపరిచారు. బాధితుల కథనం మేరకు.. గ్రామంలో పది రోజుల క్రితం నిర్వహించిన ఏరువాక పౌర్ణమి ఉత్సవాల్లో టీడీపీ నాయకులు సుంకన్న ఎద్దులకు టీడీపీ జెండా కట్టారు. దాన్ని మనసులో పెట్టుకున్న వైసీపీ నాయకుడు గోవిందు, అనుచరులు శివ, శేఖర్, లాలూ, ముద్దలయ్య, గోవిందరాజు, నాగరాజు శనివారం సాయంత్రం టీడీపీ కార్యకర్తల ఇంటికి వెళ్లి కత్తులతో దాడి చేశారు. దీంతో సుంకన్న, అతని తమ్ముడు లక్ష్మన్నకు తీవ్ర గాయాలతో రక్తస్రావమైంది. అలాగే బాధితుల బంధువు రాముడుకు కూడా గాయాలయ్యాయి. వీరికి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్పీని కలవనున్నట్లు బాధితులు తెలిపారు. ఆస్పరి సీఐ మస్తాన్ వలి మాట్లాడుతూ ఐనేకల్లుకు చెందిన సంజన్న ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన గోవిందుతోపాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తెలంగాణ పీజీ సెట్‌లో ప్రథమ ర్యాంకు



షేక్ అర్షియా కోనైన్

పాణ్యం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పీజీసెట్ ఫార్మసీ విభాగంలో శాంతిరాం ఫార్మసీ కళాశాల విద్యార్థిని షేక్ అర్షియా కోనైన్ రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదనశెట్టి తెలిపారు. ఆదివారం ఆయన మట్లాడుతూ తెలంగాణ పీజీసెట్ 2025 పార్మసీ విభాగం పరీక్షా ఫలితాల్లో విద్యార్థిని తెలంగాణ రాష్ట్ర మొదటి ర్యాంకు సాధించిందన్నారు. వంద మార్కులతో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిందన్నారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఎం శాంతిరాముడు, ఎండీ శివరామ్, డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది విద్యార్థినిని అభినందించారు.

మారకపోతే మార్చేస్తాం



సమావేశంలో పాల్గొన్న మంత్రి, ఎంపీ, టీడీపీ నాయకులు

- ఉమ్మడి జిల్లాలో పలువురు ఎమ్మెల్యేల పనితీరు బాగా లేదు
- ఎంపీలు, ఎమ్మెల్యేలు నిత్యం ప్రజల్లో ఉండాలి
- సూపర్ సిక్స్ పథకాలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- టీడీపీ అధినేత చంద్రబాబు సూచనలు

కర్నూలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలు, నామినేటెడ్ పదవులు పొందిన నాయకుల్లో కొందరి పని తీరు బాగా లేదు.. వారు మారాలి..లేకపోతే మార్చేస్తాం..అని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆదివారం మంగళగిరిలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, టీడీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఆదోని టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, ఆలూరు, మంత్రాలయం ఇన్‌చార్జ్‌లు వీరభద్రగౌడ్, ఎన్.రాఘవేంద్రరెడ్డి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కేడీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీఎంసీ ఛైర్మన్ నాగేశ్వరరావుయాదవ్ సహా వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు ధర్మవరం సుబ్బారెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, కప్పట్రాళ్ల బొజ్జమ్మ ఏపీ శాలివాహన కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ తుగ్గలి నాగేంద్ర తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉండి, కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. జూలై 2 నుంచి చేపట్టే ఇంటింటికి కార్యక్రమం దిగ్విజయం చేస్తూ ప్రజా ప్రతినిధులు ప్రజల మధ్యకు వెళ్లాలని గట్టిగా చెప్పారు. 2029 ఎన్నికలే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లాలో పలువురు ఎమ్మెల్యేల పని తీరు బాగా లేదనే రిపోర్టు వచ్చిందని, వారు తమ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

అధినేత హెచ్చరికలతోనైనా మారుతారా..?:

ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ మార్గాలు ద్వారా నివేదికలు తెప్పించుకున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేల పనితీరు బాగా లేదంటూ ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. ధనాపేక్షతతో ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు ఎమ్మెల్యేల స్థానంలో ఇతరులు పెత్తనం చెలాయిస్తూ షాడో ఎమ్మెల్యేలుగా మారారనే ఫిర్యాదులు అధిష్టానానికి వెళ్లాయని సమాచారం. ఎర్రమట్టి, మద్యం, ఉద్యోగుల బదిలీల్లో నాటి వైసీపీ ఎమ్మెల్యేలకు ఏమాత్రం తీసిపోరని, ఇలాగే కొనసాగితే పార్టీకి తీవ్ర నష్టం తప్పదనే సంకేతాలు నిఘా వర్గాలు ప్రభుత్వానికి ఇచ్చినట్లు విశ్వాసనీయంగా తెలుస్తోంది. ఈ నివేదికలు ఆధారంగా పని తీరు బాగా లేకపోయినా, మారకపోయినా గుడ్‌బై చెప్పేస్తానని అధినేత చంద్రబాబు ఘాటుగా హెచ్చరించారు. ఇప్పటికైనా ఉమ్మడి జిల్లాలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు మారుతారా..? అంటూ టీడీపీ శ్రేణులే చర్చించుకోవడం కొసమెరుపు.



సమావేశంలో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఆ ఇద్దరి కోసం

- ఆదుకుంటున్న ఆపన్నహస్తాలు
- శాశ్వత పరిష్కారం దిశగా అధికారుల చర్యలు
- స్వచ్ఛంద సంస్థల హామీ
- వెంటనే ఇంటి నిర్మాణం చేపడుతాం - ఆదోని సబ్ కలెక్టర్, మౌర్య భరద్వాజ్
- విద్యార్థిని ఉన్నత చదువుకు చేయూతనిస్తాం - శామ్యూల్ పాల్, డీఈవో



తల్లి, కూతుళ్లతో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంత్రాలయం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం తండాకు చెందిన సుగాలి చిన్న రంగమ్మ, ఆమె కూతురు కీర్తిబాయికి అధికారులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు, రాజకీయ నేతలు ఆపన్న హస్తం అందించేందుకు ముందుకు వచ్చారు. ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆ ఇద్దరు.. ఐదేళ్లుగా చెట్టుకిందే నివాసం.. అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన కలెక్టర్ రంజిత్ బాషా, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజరావు, ఆర్ఐ జనార్దన్‌రావు గ్రామానికి వెళ్లి వీరి పరిస్థితిని పరిశీలించి తల్లి కూతుళ్లను ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లారు. వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారంలో స్వగ్రామంలోనే కొత్త ఇల్లు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. విద్యార్థిని కర్నూలులో చదువుకునేందుకు అయ్యే ఖర్చు భరిస్తామని అన్నారు. డీఈవో శామ్యూల్ పాల్ తండాకు వెళ్లి చెట్టు నీడన వారు ఉంటున్న ప్రాంతాన్ని పరిశీలించి వారి సమస్యలను గ్రామస్థులను, బంధువులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిటైర్డు ఐజీ మహ్మద్ ఇక్బాల్ పంపిన రూ.25వేల నగదును జన్‌జీవన్ జ్యోతి అధ్యక్షుడు నవాజ్, మదర్ థెరిస్సా సంస్థ అధ్యక్షుడు నజీర్, వీరసాబ్, ఈరన్న ఇచ్చిన రూ.25వేల నగదును డీఈవో, ఎంఈవో షైనుద్దీన్‌ల చేతుల మీదుగా అందజేశారు. అదే విధంగా మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి వీరి కుటుంబాన్ని పరామర్శించి వీరి కుటుంబానికి అన్ని సౌకర్యాలు కల్పించి కీర్తిబాయి చదువుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నంద్యాల పంచాయతీరాజ్ డీఈ నాగరాజు రూ.10వేలు, రచ్చుమర్రికి చెందిన వీబీకే పద్మావతి రూ.3వేలు ఇచ్చారు. ఆర్డీటీ సంస్థ ఆ కుటుంబానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. గ్రామంలోని ఎంప్లాయిస్ అసోసియేషన్ దాదాపు రూ.70వేల ఖర్చుతో తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐలు విజయకుమార్, శివాంజల్, ఆదోని ఎస్బీ ఎస్ఐ వేణుగోపాల్, మాధవరం మారుతి ట్రేడర్స్ గూర్మింటి భీమిరెడ్డి, స్థానికుడు అమ్రేష్ నాయక్, రంగనాయకులు చిన్న రంగమ్మ కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని తెలిపారు. మంత్రాలయం చెందిన బొంబాయి శివ వీరికి అవసరమైన నగదును అందిస్తామని ముందుకు వచ్చారు. వారికి నిత్యావసర సరుకులు, దుప్పట్లు, దుస్తులు ఏర్పాటు చేస్తామని పలువురు దాతలు హామీ ఇచ్చారు. గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుగాలి రాజు ఉన్నతాధికారులతో మాట్లాడి వారికి శాశ్వత పరిష్కారాన్ని చూపుతామని తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఆ ఇద్దరు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి వచ్చిన స్పందనకు ఆ తల్లి కూతుళ్లు సంతోషం వ్యక్తం చేశారు.



నగదు అందజేస్తున్న డీఈవో

నేడు గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు బదిలీ కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న ఏఎన్ఎం గ్రేడ్-3, వార్డు హెల్త్ సెక్రటరీలకు సోమవారం బదిలీల కౌన్సెలింగ్ కర్నూలు మెడికల్ కాలేజీ న్యూ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఉదయం ఏఎన్ఎం గ్రేడ్-3 అభ్యర్థులు ఉదయం 7 గంటలలోపు కౌన్సెలింగ్‌కు తప్పక హాజరు కావాలని, ఆలస్యంగా వచ్చిన వారిని, గైర్హాజర్‌గానే పరిగణిస్తామన్నారు. ఐదేళ్లు పూర్తయి లాంగ్ స్టాండింగ్‌లో 754 మంది ఉన్నారు. సోమవారం ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లో కౌన్సెలింగ్ జరుగుతుంది.

ఆందోళనలో ఉద్యోగులు

ఏఎన్ఎం గ్రేడ్-3ల కౌన్సెలింగ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్లక్ష్యంగా బదిలీల ప్రక్రియ దైవాదీనంగా మారింది. ఓ పక్క ఆదివారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు సోమవారం ఉదయం 7 గంటలకు బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాలో ముదుగా సీనియారిటీ జాబితాను విడుదల చేసిన కర్నూలు జిల్లాలో మాత్రం ఆదివారం రాత్రి 9 గంటలకు సీనియారిటీ విడుదల చేయడంతో ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఆదివారం జరగాల్సిన బదిలీలు వాయిదా వేస్తున్నట్లు ఉద్యోగులకు మెసేజ్ చేసిన అధికారులు సీనియారిటీ జాబితా సోమవారం రాత్రి విడుదల చేస్తే కౌన్సెలింగ్‌లో మొదట ఉన్న ఏఎస్ఎం గ్రేడ్-3ల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. శ్రీశైలం, హాలహర్వి, హొళగుంద, కోసిగి, కౌతాళం, చాగలమర్రి, ప్రాంతాల నుంచి సోమవారం ఉదయం కౌన్సెలింగ్‌కు చేరుకోవాలంటే ఆదివారం రాత్రి చేరుకోవాల్సి ఉంటుంది. అయితే 9 గంటల సమయంలో సీనియారిటీ జాబితా ఇస్తే దూర ప్రాంతాల నుంచి ఎప్పుడు చేరుకోవాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు డీఎంహెచ్‌వోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. డీఎంహెచ్‌వో ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

పౌరాణిక నాటకాలకు ఆదరణ పెరగాలి

- పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి
- అలరించిన నాటిక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇతర భాషల్లో లేని తెలుగు పౌరాణిక పద్య నాటకాలకు ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందని పారిశ్రామికవేత్త, కర్నూలు పిరమిడ్ స్పిరిచ్యువల్ సెంటర్ వ్యవస్థాపకుడు బీవీ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, హైదరాబాదు విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ సంస్థ వారి 'స్వేచ్ఛ' సాంఘిక నాటిక ప్రదర్శన ప్రేక్షకుల మన్నన పొందింది. ఈ ప్రదర్శనకు ముందు బీవీ రెడ్డి మాట్లాడుతూ కళల కాణాచిగా ఖ్యాతి పొందిన కర్నూలు జిల్లాలో పౌరాణిక పద్య నాటకాలకు పూర్వ వైభవం రావాలని ఆకాంక్షించారు. జి.పుల్లయ్య మాట్లాడుతూ పౌరాణిక నాటక ప్రదర్శనలకు కొత్తతరం నటులు, యువత ముందుకు రావాలని సూచించారు. సభాధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళాక్షేత్రం గౌరవ ఛైర్మన్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ సూచనల మేరకు ప్రతి ఆదివారం ఒక సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అనంతరం ప్రదర్శించిన స్వేచ్ఛ నాటికలో మహేశ్వరిగా సురభి లలిత, శ్వేతగా మంజు భార్గవి, అవినాష్‌గా గోవర్ధన్ రెడ్డి, ఆనందమూర్తిగా సతీష్ నటించగా, సీనియర్ రంగస్థల నటుడు బీఎం రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, సీనియర్ రంగస్థల నటుడు పి. దస్తగిరి, కార్యక్రమ కన్వీనర్ పి.రాజారత్నం, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియా, ఆంధ్రజ్యోతి యూనిట్ మేనేజర్ ఆకుల లక్ష్మణ్, బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప తదితరులు పాల్గొన్నారు.



నాటక ప్రదర్శనలను ప్రారంభిస్తున్న దృశ్యం

అలరించిన శ్రీకృష్ణ రాయబారం

కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులతో ఆదివారం రాత్రి ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం (పడకసీను) పౌరాణిక పద్య నాటకం ఆద్యంతం ప్రేక్షకులను అలరింపజేసింది. పత్తి ఓబులయ్య దర్శకత్వంలో శ్రీకృష్ణుడిగా భాస్కర్ యాదవ్, అర్జునుడిగా కేవీ రమణ, దుర్యోధనుడిగా చల్లా నవీన్‌కుమార్ చౌదరి నటించారు. సంగీతం బలరాం సమకూర్చారు.



కళాకారులను సన్మానిస్తున్న బీవీ రెడ్డి

యువకుడి దారుణ హత్య



వినయ్‌కుమార్ (ఫైల్)

నంద్యాల టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రం శివారులోని ఎల్‌కేఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని బావి వద్ద ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. నంద్యాల తాలుకా సీఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాలివీ.. నంద్యాల పట్టణం దేవనగర్‌కు చెందిన వినయ్‌కుమార్ అలియాస్ మోటు(24) ఆదివారం ఉదయం 11గంటల సమయంలో ఇద్దరు యువకులతో కలిసి ఎల్‌కేఆర్ సమీపంలోని బావి వద్దకు చేరుకున్నాడు. అయితే వీరి మధ్య ఘర్షణ జరిగింది. వినయ్‌కుమార్‌ను కత్తితో దాడిచేసి బండరాళ్లతో మోది హత్య చేశారు. మాదకద్రవ్యాల అమ్మకం ద్వారా వచ్చిన డబ్బు విషయంలో ఘర్షణ పడి హత్య చేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. వినయ్‌కుమార్‌తో పాటు వెళ్లిన ఆ ఇద్దరు ఎవరు అనేది విచారిస్తున్నామని, యువకుడి తండ్రి సత్యబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఈ యువకుడిపై గతంలో ఒక దొంగతనం, రెండు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నారని, ఇటీవలే జైలు నుంచి బయటకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

మహిళా పోలీసు మృతి



దివ్య (ఫైల్)

ఆదోని అగ్రికల్చర్ జూన్ 29 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని 34వార్డు సచివాలయం మహిళా పోలీస్ దివ్య(26) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. వివరాల మేరకు.. 14రోజులు క్రితం ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అయితే రెండు రోజుల నుంచి అస్వస్థతకు గురికావడంతో బంధువులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు కర్నూలుకి రెఫర్ చేయడంతో అంబులెన్స్‌లో కర్నూలుకు తీసుకెళ్లేలోపు మార్గమధ్యంలో మృతి చెందింది. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య

ఆదోని అగ్రికల్చర్ జూన్ 29 (ఆంధ్ర జ్యోతి): తల్లి మందలించిందని ఓ యువతి ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని అమరావతి నగర్‌కు చెందిన శంకరమ్మ, చిన్న ఉసేని దంపతులు కుట్టుమిషన్ ద్వారా జీవనం సాగిస్తున్నారు. వారి చివరి కుమార్తె సాయిలక్ష్మి(20)ని కుట్టుమిషన్ నేర్చుకోవాల్సిందిగా తల్లి సూచించింది. అయితే తనకు కుట్టుమిషన్ నేర్చుకోవడం ఇష్టం లేదని కూతురు చెప్పడంతో తల్లి మందలించింది. మనస్తాపం చెందిన సాయిలక్ష్మి ఇంట్లోకి వెళ్లి ఉరేసుకుంది. తల్లిదండ్రులు గమనించేలోపు మృతి చెంది ఉంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అభివృద్ధి పేరుతో చెట్ల నరికివేత

కాలువ నిర్మాణానికి అడ్డంకి?

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలలో అభివృద్ధి పనుల పేరుతో భారీ వృక్షాలను నరికేస్తున్నారు. ప్రస్తుతం బంగారుపేట మత్స్యశాఖ కార్యాలయం పక్కనే కాలువ నిర్మాణం చేపడుతున్నారు. ఈ క్రమంలో సుమారు పదేళ్ల క్రితం వేసిన చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికేశారు. ఈనెల 5న జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర పాలక కమిషనర్ సుమారు 1000 మొక్కలను పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటాలని సూచనలిచ్చారు. అయితే ఇంజనీరింగ్ అధికారులు అందుకు విరుద్ధంగా చెట్లను నరకడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఒక మొక్క వేసాక అది పెరిగి పెద్దది కావడానికి కనీసం ఐదేళ్లు పడుతోంది. అలాంటిది కాలువ నిర్మాణానికి అడ్డుగా ఉందని రెండు వృక్షాలను నరికివేశారు. ఈ విషయంపై పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిలో చెట్లను నరికివేయడంతో అవి రోడ్డుకి అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ఒక వైపు మాత్రమే వాహనాలు వెళ్తున్నాయి.


బంగారుపేటలో చెట్లను నరికి వేసిన దృశ్యం

ఈ ప్రభుత్వంతోనే ఎస్టీ బిల్లు సాధ్యం

ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మన్న


మాట్లాడుతున్న లక్ష్మన్న

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వాల్మీకుల ఎస్టీ బిల్లు ఈ ప్రభుత్వం ద్వారానే సాధ్యమని, ఎస్టీ బిల్లు త్వరలో పాస్ అవుతుందని రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్య క్షుడు, జనసేన మంత్రాలయం ఇన్‌చార్జి బి.లక్ష్మన్న అన్నారు. ఆదివారం బిర్లా కాంపౌండులోని సంఘం కార్యాల యంలో వాల్మీకి సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. లక్ష్మన్న మాట్లాడుతూ వాల్మీకుల పోరాటాల వల్లనే వాల్మీకి జయంతిని కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రభుత్వమే నిర్వహించే విధంగా జీవో పాస్ చేయించా మన్నారు. వాల్మీకి ఎస్టీ బిల్లు గురించి మంత్రులు నారా లోకేశ్, నాదేండ్ల మనోహర్‌ను కలిశామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగ్గాపురం చిన్న ఈరన్న, వైద్యులు భవాని ప్రసాద్, కుబేరస్వామి, బడన్న, రంగనాయకులు, జిల్లా అధ్య క్షుడు అర్జున్, రామక్రిష్ణ, బేతం కృష్ణ, తలారి కృష్ణ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్సులో రాణించాలి: టీజీ విభూ


చిన్నారులకు మెడల్స్ అందజేస్తున్న టీజీ విభూ

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్సులో రాణించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తనయుడు టీజీ విభూ అన్నారు. ఆదివారం టీజీవీ స్వగృహంలో తైక్వాండో బెల్టు గ్రేడింగ్ విజేతలకు ఆయన మెడల్స్, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. టీజీవీ, టీజీబీ తైక్వాండో అకాడమి శిక్షకుడు టీ.వెంకటేశ్‌ను ఆయన అభినందించారు. అనంతరం టీజీ విభూ బెల్టు గ్రేడింగ్ విజేతలకు వివిధ రకాల బెల్టులు అందజేశారు. తైక్వాండో మార్షల్స్ శిక్షకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్యులకు బ్యాడ్మింటన్ పోటీలు



ట్రోఫీతో విజేతలైన డాక్టర్లు అమర్నాథ్ రెడ్డి, వాసురెడ్డి

కర్నూలు హాస్పిటల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్స వాన్ని పురస్కరించుకుని కిమ్స్ హాస్పిటల్, కర్నూలు ఐఎంఏ ఆధ్వర్యంలో ఆది వారం ఉదయం నగరంలో రాయలసీమ వైద్యులకు మెన్స్ ఓపెన్ డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు నిర్వహించారు. ఈ టోర్నమెంటులో రాయలసీమ వ్యాప్తంగా ఉన్న వైద్యులు పాల్గొన్నారు. మొదటి విజేతగా కర్నూలు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ అమర్నాథ్ రెడ్డి, సర్జికల్ అంకాలజిస్టు డాక్టర్ వాసురెడ్డి రోలింగ్ ట్రోఫీ గెలుచుకున్నారు. రెండో విజేతగా డాక్టర్లు ఎడ్విన్, భరత్, మూడో విజేతగా డాక్టర్లు సి.సునీల్ కుమార్ రెడ్డి, అనిల్ నిలిచారు. వైద్య విద్యార్థుల క్యాటగిరిలో మొదటి విజేతగా డాక్టర్లు భరత్, భార్గవ్ నిలిచారు. విజేతలకు కిమ్స్ హాస్పిటల్ సీవోడీ డాక్టర్ సునీల్ సేపూరి, ఐఎంఏ కర్నూలు బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు, డాక్టర్లు రామచంద్ర నాయుడు, ఎస్వీ రామ్మోహన్ రెడ్డి విజేతలకు ట్రోఫీని అందజేశారు.

రైతుల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

సి.బెళగల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని సింగిల్ విండో అధ్యక్షుడు శీల చిన్న తిమ్మప్ప అన్నారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సింగిల్ విండో అధ్యక్షుడిగా తమ పేరును ప్రకటించిన జిల్లా కేడీసీసీబీ చైర్మన్ ఎదురూర్ విష్ణువర్ధన్‌రెడ్డి, కోడు మూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చంద్ర శేఖర్, తాలుక తెలుగు యువత అధ్యక్షుడు కొత్తకోట హరి, పాఠశాలల విద్యాకమిటీ చైర్మన్లు వెంకటేశ్వర్లు, ముని, బీమన్న, శ్రీనివాసులు, బాలాజీ, ఎంపీటీసీ ఈరన్నగౌడు, రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా గోరంట్ల

గూడూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కౌన్సిల్ రాష్ట్ర సభ్యుడిగా గూడూరు చెందిన గోరంట్లను నియమించినట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడు తెలిపారు. ఆదివారం ఆయన గూడూరులో మాట్లాడుతూ బీజేపీకి గోరంట్ల చేస్తున్న సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తించి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమించిందన్నారు. గోరంట్ల మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిందని, పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు.

రెవెన్యూ శాఖలో అవినీతిని అరికట్టండి

కర్నూలు కలెక్టరేట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ శాఖలోని అవినీతిని అరికట్టాలని జిల్లా ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు బలరాం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రెవెన్యూ అధికారులు రైతుల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరో పించారు. పుట్టిన సర్టిఫికెట్ నుంచి పాసు పుస్తకాలు వరకు లంచాలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

రచ్చకట్ట పంచాయితీలు నిర్వహిస్తే చర్యలు: ఎస్ఐ

సి.బెళగల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రచ్చకట్ట పంచాయితీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పరమేష్‌నాయక్ రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం సి.బెళగల్ ఇనగండ్ల, పోలకల్లు, బ్రాహ్మణదొడ్డి, తిమ్మనదొడ్డి, ముడుమాల, మారందొడ్డి, పలుకుదొడ్డి గ్రామాల్లోని రౌడీషీటర్లను పోలీసు స్టేషన్‌కు పిలింపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏఎస్ఐ ఆంజినేయులు, పోలీసులు పాల్గొన్నారు.

నేడు జూపల్లె ఎల్లారెడ్డి సంస్మరణ సభ



కర్నూలు హాస్పిటల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్ఆర్ పేటలోని రేణుకా మల్టిస్పెషాలిటీ హాస్పిటల్‌లో సోమవారం మధ్యాహ్నం 12గంటలకు రిటైర్డు హెడ్‌మాస్టర్ (మిడ్తూరు) జూపల్లె ఎల్లారెడ్డి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు కుమారుడు డాక్టర్ జే.రఘునాథరెడ్డి, కోడలు డాక్టర్ రాజేశ్వరి తెలిపారు. ఎల్లారెడ్డి ఈనెల 20న కన్నుమూశారన్నారు. ఈ సభకు బంధువులు, మిత్రులు హాజరుకావాలని కోరారు.

మాజీ సర్పంచ్ మృతి

సి.బెళగల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ మాజీ సర్పంచ్ ధరణి పోగు జీవరత్నమ్మ (73) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈమె 2006 సంవత్సరం నుంచి 2014 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఈమెకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీ పీలు నాగమణి, దేవరాజు, టీడీపీ నాయకులు తిమ్మప్ప, వెంకటేశ్వర్లు, రామ్‌భూపాల్‌రెడ్డి, విష్ణు హమాలీ యూనియన్ నాయకుడు బీమన్న ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ


కాల్వబుగ్గలో ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఈవో మద్దిలేటి, అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ

ఓర్వకల్లు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రహరీ నిర్మాణానికి ఈవో మద్దిలేటి, అర్చకులు కల్లె లక్ష్మీనారాయణశర్మలు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో మంత్రి నిమ్మల రామనాయుడు కేటాయించిన రూ.40 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గొల్ల నాగరాజు, వడ్డె నారాయణ, వడ్డె శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

గూడూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని, లేనిపక్షం లో ఆందోళనలు ఉధృతం చేస్తామని మున్సిపల్ పంచాయతీ ఇంజనీ రింగ్ సెక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు అరవింద్, డూకేశ్వరరావు, బసవరాజ్ హెచ్చరించారు. ఆదివారం గూడూరు పట్టణంలో పాతబస్టాండు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు పూలమాలలు వేసి అనంతరం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ డిమాండ్లను నెరవేర్చకపోతే వీధిలైట్లు, తాగునీటి సరఫరాను నిలిపివేసి నిరవధిక సమ్మెలోకి వెళ్తామన్నారు. టెక్నికల్ సెక్షన్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజ నీరింగ్ సెక్షన్ కార్మికులు అరవింద్, డూకేశ్వరరావు, ఆంజనేయులు, హరిబాబు, జయన్న, ఖాజాహుశేన్, వుశేన్ ఖాన్, మధు, ఆలిబాషా ప్రభాకర్ తెలిపారు.

సేవలే ఉద్యోగులకు గుర్తింపు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రజలకు అందించిన సేవలే గుర్తింపు ఇస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ పేర్కొన్నారు. ఆదివారం ఎస్టీయూ ఆధ్వర్యంలో స్థానిక కేశవ గ్రాండ్స్‌లో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన పదవి విరమణ పొందిన గోనెగండ్ల మండలం కున్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న కే.పరమేశ్వరరెడ్డి పదవి విరమణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా డీఈవో శామ్యూల్ పాల్ హాజరై మాట్లాడుతూ అన్ని వృత్తుల్లో కన్నా ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని అన్నారు. సందర్భంగా వక్తలు పరమేశ్వరరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, టికే జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఎస్టీ రిజర్వేషన్‌పై కార్యాచరణ ప్రకటన

కర్నూలు కలెక్టరేట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ కోసం త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని దక్షిణ భారత వాల్మీకి సేవా ట్రస్టు అధినేత రంగనాయకులు తెలిపారు. ఆదివారం వాల్మీకి బోయ సేవా సంస్థ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్‌పై ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. అనంతరం ఉత్తమ డాక్టర్ అవార్డు గ్రహీత డాక్టర్ భవానీ ప్రసాద్‌ను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కుబేరస్వామి, తలారి కృష్ణమనాయుడు, రామానాయుడు, వీజీఆర్ కొండయ్య, మంత్రాలయం లక్ష్మన్న, జగ్గాపురం ఈరన్న, బోయ పులి కొండన్న, కోసిగి వెంకటరెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణ, జట్టప్ప, ఆలూరు ఈరన్న, ఎల్లార్తి అర్జున్, బేతం కృష్ణుడు, విష్ణుమూర్తి, డాక్టర్ కృష్ణమూర్తి, సత్రం రామకృష్ణుడు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ బాబురావు

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే విష రసాయనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ బాబురావు అన్నారు. ఆదివారం బిర్లా గేట్ సమీపంలోని డాక్టర్ బ్రహ్మారెడ్డి సమావేశభవనంలో అవగాహన సదస్సు జరిగింది. ప్రజా సంఘాల ఐక్యవేదిక, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్. రాధాక్రిష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ బాబురావు మాట్లా డుతూ టీజీవి యాజమాన్యానికి పీటీఎఫ్ఈ రసాయన తయారీపై ప్రజలకు వివరించ డానికి ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. ఈ సదస్సులో జనవిజ్ఞాన వేదిక నాయకులు మహ్మద్‌మియ్యా, ప్రజా సంగాల ఐక్య వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నాయకులు రత్నం ఏసుపు, జి.రామక్రిష్ణ, ఎండి.ఆనంద్‌బాబు, భాస్కర్‌రెడ్డి, డేవిడ్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

● చాంపియన్స్‌గా ప్రకాశం, గుంటూరు జట్లు
● కర్నూలు బాలురకు రజతం, బాలికలకు కాంస్యం



విజేత ప్రకాశం బాలుర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఆదర్శ విద్యామందిర్ క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి రగ్బీ జూనియర్ అండర్-18 బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా ఆదర్శ విద్యామందిర్ డైరెక్టర్ డా.బి. హరికిషన్, రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా డా.హరికిషన్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థ పలుమార్లు పోటీలకు వేదిక కావడం తనకు సంతోషంగా ఉందన్నారు.

విజేతల వివరాలిలా ఉన్నాయి:

● బాలుర విభాగంలో ప్రకాశం, కర్నూలు, విశాఖపట్నం మొదటి, రెండో, మూడో స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు.

● బాలికల విభాగంలో గుంటూరు, అనంతపురం ఈస్ట్ గోదావరి జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

ఈ ముగింపు కార్యక్రమంలో రగ్బీ ఇండియా ప్రతినిధి నోయల్ మ్యాచ్, వివిధ జిల్లాలకు చెందిన రగ్బీ సంఘం ప్రతినిధులు చంద్రశేఖర్, లక్ష్మణ్‌రావు, శంకరయ్య, మహబూబ్ సుభాని, కొండేపోగు చిన్న సుంకన్న, శేషయ్య, గీతా సుప్రియ, ఫాతిమా పాల్గొన్నారు.

సమాజహితానికి దోహదపడే సాహిత్యం అవసరం

రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య, సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సమాజ హితానికి దోహదపడే సాహిత్యం నేడు ఎంతో అవసరమని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. ఆదివారం నగరంలో మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో ప్రముఖ రచయిత్రి, నంద్యాలకు చెందిన భవానీ లీలావతమ్మ స్మృతిపథంలో, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ముద్రించిన 'భవ్యభావాల గని-మా భవానీ లీలావతమ్మ' పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. సాహితీ సదస్సు సాహిత్య సంస్థ, నరసం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సభలో తొలుత దివంగత లీలావతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జి. పుల్లయ్య పుస్తకాన్ని, ఇతర సాహితీవేత్తలతో కలిసి ఆవిష్కరించారు. జి.పుల్లయ్య మాట్లాడుతూ సాహిత్యకారులు చేసే రచనలు దేశాభివృద్ధికి ఎంతో దోహదపడతాయన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ లీలావతమ్మ పద్యాల్లో ఎంతో లాలిత్యం ఉంటుందని, ఆమె పద్యాలను ఒకచోట చేర్చి సంకలాన్ని తీసుకురావడం అభినందనీయమని చెప్పారు. నరసం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కా.వెం.సుబ్బలక్ష్మమ్మ, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవిలు మాట్లాడుతూ భవానీ లీలావతమ్మ తెలుగు ఉపాధ్యాయురాలిగా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారని, ఆమె ప్రమాదవశాత్తు మరణించడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో సాహితీ సదస్సు అధ్యక్షుడు కేసీ కల్కూర, ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషా, భాషావేత్త జేఎస్ ఆర్‌కే శర్మ, కవయిత్రులు పద్మావతి, సునీత, చంద్రమౌళిని, నీలిమ, హైమావతి, రుక్మిణి, సీతామహాలక్ష్మి, లీలావతి కుమారులు రవి, కల్యాణ్ పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ అద్భుతం


ఆలయాన్ని పరిశీలిస్తున్న కోటేశ్వర శర్మ

కోడుమూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంకటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ అద్భుతమని విశ్వహిందూ పరిషత్ నేషనల్ జాయింట్ కార్యదర్శి కోటేశ్వరశర్మ అన్నారు. కోడుమూరు పట్టణంలోని నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో ఎద్దుల మహేశ్వరరెడ్డి నిర్మిస్తున్న ఆలయం ప్రాచీన కాలం నాటి ఆలయాన్ని తలపించే విధంగా ఉందని అన్నారు. పెద్దలు చంద్రమౌళి, సురేంద్ర ఆలయ కమిటీ సభ్యులు వేణుగోపాల్, దామోదర్, మధుసూదన్, రామకృష్ణ, రవి, నటరాజ్, కిరణ్, అశోక్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి: పీఆర్‌టీయూ

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడుఎస్వీ కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్స్, బిల్లులను, డీఏ మంజూరు చేయాలన్నారు. పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు వి.రవిప్రకాష్, ఓర్వకల్లు మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటం: సీపీఐ

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కార్మికులు, కర్షకుల సమస్యలపై సీపీఐ పోరాటం చేస్తుందని నగర సహాయ కార్యదర్శి దాసరి మహేష్ అన్నారు. ఆదివారం సీపీఐ శాఖ మహాసభలు గనిగల్లి, కుమ్మరి వీధి, ఇందిరమ్మ కాలనీ, టీవీ 9 ప్రజా నగర్ ప్రాంతాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సహాయ కార్యదర్శులు దంబోళం శ్రీనివాసరావు, మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ పాలకులు ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. అనంతరం వివిధ శాఖల నూతన కమిటీలను ఎనుకున్నారు. బి.మధు, ఎర్రలక్ష్మి, ఇమాంబీ, ఖాజామునిని, దేవిబాయ్ పాల్గొన్నారు.

కల్లూరు సింగిల్ విండో చైర్మన్‌కు అభినందనలు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కల్లూరు సింగిల్ విండో చైర్మన్ పర్ల శేఖర్‌ను జిల్లా కురువ సంఘం నాయకులు ఆదివారం కలిసి శాలువ కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. సింగిల్ విండో చైర్మన్‌గా తనకు అవకాశం ఇచ్చినందుకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి, గౌరు వెంకటరెడ్డి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్‌కు అభినందనలు తెలిపిన వారిలో జిల్లా కురువ సంఘం జిల్లా గౌరవ సలహాదారుడు పాల సుంకన్న, గుడిసె శివన్న, ఎం.రంగస్వామి, పెద్దపాడు ధనుంజయ, జిల్లా సహాయ కార్యదర్శి కే.దేవేంద్ర ఉన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట 2025 సవరణను వెనక్కి తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎస్టీబీసీ కళాశాల మైదానంలో జరిగే బహిరగ సభను జయప్రదం చేయాలని జేఏసీ కన్వీనర్ జాకీర్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఓ మసీదులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా, ప్రజలకు వ్యతిరేకంగా పరిపాలన చేస్తుందని విమర్శించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు అధ్యక్షుడు ఖాళీద్ షఫీఉల్లా రహమాని, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా గౌరవ సభ్యుడు, ఎంపీ ఆసదుద్దీన్ ఓవైసీ, అబ్దుల్ రహీం ఖురామ్ హాజరవుతారన్నారు. ఎండీ షరీఫ్, హమీద్, అమానుల్లా పాల్గొన్నారు.

ముగిసిన డ్రోన్ టెక్నాలజీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ


కార్యక్రమంలో పాల్గొన్న క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ టెక్నాలజీలో రాబోయే కాలంలో జరిగే మార్పులకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిలో ప్రగతి సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం జగన్నాథగట్టు ట్రిపుల్ ఐటీ డీఎంలో క్లస్టర్ యూనివర్సిటీ అధ్యాపకులకు డ్రోన్ టెక్నాలజీ నైపుణ్యాభివృద్ధి ముగింపు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్థాపించబోతున్న డ్రోన్ హబ్‌కు అనుగుణంగా డ్రోన్ టెక్నాలజీలో విద్యార్థులను ఉద్యోగానికి సిద్ధం చేసేలా అధ్యాపకులు శిక్షణ ఇస్తామన్నారు. డా. పద్మావతి మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ డాల్ఫిన్ డ్రీమ్ టెక్నాలజీ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డా. కృష్ణ నాయక్, డా. శ్రీహరిపత్రి, ప్రిన్సిపాల్ కే.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి మంత్రి టీజీ కృషి

తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్


మాట్లాడుతున్న అబ్బాస్

కర్నూలు అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా అభి వృద్ధికి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కృషి చేస్తున్నారని తెలుగు యువత జిల్లా అధ్యక్షులు అబ్బాస్ అన్నారు. ఆదివారం నగర టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటాడారు. ఎన్నికల ముందు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు తెచ్చి నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తానని ఇచ్చిన హామీ మేరకు మంత్రి జిల్లాకు పరిశ్రమలను తీసుకువస్తున్నారన్నారు. జిల్లాలోని ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో ప్రముఖ కంపెనీలు తరలి రావడం వెనుక మంత్రి కృషి ఉందన్నారు. రిలయన్స్ సంస్థ 80 ఎకరాల్లో రూ.1,622 కోట్లతో శీతలపానియాల పరిశ్రమను ఏడాదిలోగా ఉత్పత్తితో అందుబాటులోకి వచ్చేలా ఏర్పాటు చేయబోతోందని, ఏపీఐ ఐసీ ఎన్నో పరిశ్రమలకు భూములను ఇప్పటికే కేటాయించిందని అన్నారు.

నేడు వినతుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

తైక్వాండోలో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తైక్వాండోలో రాణించాలని సెపక్‌తక్రా రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కృష్ణానగర్‌లో తైక్వాండో బెల్ట్ టెస్టు గ్రేడ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిభావంతులకు ఆరేంజ్, ఎల్లో, గ్రీన్, బ్లాక్ బెల్టులను ప్రదానం చేశారు.

లలితా పీఠంలో అమ్మవారికి పూజలు

కర్నూలు కల్చరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో వారాహిదేవి అమ్మవారికి పూజలు చేశారు. ఆదివారం వారాహిదేవి అమ్మవారికి నిమ్మకాలతో అలకరించారు. పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి ఆధ్వర్యంలో మహిళా భక్తులు అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

కుంటలా రోడ్డు



మండలంలోని జొహరాపురం గ్రామ రహదారి చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. నల్లరేగడి నేల కావడంతో నడిచేందుకు కూడా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్పరి, మొలగవల్లి గ్రామాల ప్రధాన కూడలి బ్రహ్మయ్య గుడి వద్ద మోకాళ్ల లోతు నీరు నిలిచింది. అధికారులు సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - ఆస్పరి

రోడ్డుపైనే చెత్త



మండలంలోని జొన్నగిరి ఎస్సీ కాలనీ వద్ద ప్రాథమిక పాఠశాల పక్కన రోడ్డంతా చెత్తాచెదారంతో నిండిపోయింది. వర్షం కురిస్తే దుర్వాసన వస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలికి చెత్త కాగితాలు తరగతి గదుల్లోకి వస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు. - తుగ్గలి

'ఆశా' పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

హాలహర్వి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ధగేరి, విరుపాపురం, బిలేహాల్ గ్రామాల్లో ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి మన్సూర్‌వలి సూచించారు. జిల్లా వైద్యాధికారులు అర్హులను ఎంపిక చేస్తారన్నారు.

సంక్షేమ పథకాలను వివరిస్తా

ఆలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తానని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ తెలిపారు. ఆదివారం అమరావతిలో సీఎం చంద్ర బాబు నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. చంద్రబాబు ఆదేశాల మేరకు నెల రోజులపాటు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.



సమీక్షలో పాల్గొన్న వీరభద్రగౌడ్

మాజీ కౌన్సిలర్‌కు ఎమ్మెల్యే నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆస్పరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన ఆదోని మాజీ కౌన్సిలర్ పగడాల గోవింద రాజులు(60) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విరుపాక్షి మృతదేహానికి నివాళి అర్పించారు. ఆదోని ఇందిరానగర్ 18వ వార్డులో కౌన్సిలర్‌గా, ఎమ్మార్పీఎస్ నాయకుడిగా సేవలలందిచారన్నారు. జడ్పీటీసీ దొరబాబు, చిన్నసంజప్ప, గోవర్ధన్, రామాంజనేయులు, పాండు, గోవిందు, పరమేష్ పాల్గొన్నారు.

శ్రామికులకు అండగా ఎర్ర జెండా

ఆదోని రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రామికులకు అండగా ఎర్ర జెండా ఉంటుందని సీపీఐ కార్యదర్శి కల్లుబావి రాజు తెలిపారు. శతాబ్ది ఉత్సవాల్లోభాగంగా, ఆదివారం దొడ్డనగేరిలో పార్టీ జెండా ఆవిష్కరించారు.

ఉపాధి వేతనాలు ఇవ్వరా?

మద్దికెర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వరా? అని జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ నాయకుడు ఆర్.వెంకటేశ్వర్లు, మండల వైసీపీ ఉపాధ్యక్షుడు కృష్ణా యాదవ్ ప్రశ్నించారు. ఆదివారం మాట్లాడుతూ ఆరు వారాలుగా కూలీల డబ్బులు రాలేదని వారు ఎలా బతకాలన్నారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి పనులు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు .

ప్రయాణం.. నరకం..

● కర్నూలు నుంచి దేవనకొండకు బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు



బస్సు ఎక్కేందుకు అవస్థలు పడుతున్న ప్రయాణికులు

దేవనకొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి కర్నూలు నుంచి ఆర్టీసీ ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. సాయంత్రం 4 గంటలు దాటితే కర్నూలు నుంచి దేవనకొండకు బస్సులు లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి వస్తే తిరిగి వెళ్లేది ఎప్పుడో? తెలియడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవనకొండ, పత్తికొండ, ఆలూరు ప్రాంతాల నుంచి రోజూ వేల సంఖ్యలో ప్రయాణికులు కర్నూలుకు వస్తారు. సాయంత్రం మూడు గంటల్లో పని పూర్తయితే తిరుగు ప్రయాణం సాఫీగా సాగుతుంది. సాయంత్రం నాలుగు గంటలు దాటిందా ఇక అంతే. ఆ సయంలో సరిపోయి నన్ని బస్సులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇక చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఉంటే అంతే. బస్సులో సీటు దక్కాలంటే పోరాటం చేయాల్సిందేనని వాపోతు న్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి కర్నూలు నంచి దేవనకొండ మీదుగా ఆలూరు, పత్తికొండకు మరిన్ని బస్సు లు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎదురుచూడాల్సి వస్తోంది



సాయంత్రం నాలుగు దాటితే కర్నూలు బస్టాండులో పత్తికొండ బస్సుల కోసం ఎదురుచూడాలి. బస్సులు ప్రయాణికుల రద్దీకి సరిపోయినన్ని లేవు. బస్సు వచ్చే లోగా సీటు కోసం పరుగు తీయాల్సి న పరిస్థితి. కుటుంబంతో వస్తే సీటు దొరకదు. నిలుచునే ప్రయాణం చేయాలి. - **బసవరాజు, ప్రయాణికుడు**

ప్రభుత్వ బడిలో చేర్పించండి

మద్దికెర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ బడికి పంపాలని హెచ్‌ఎంతోపాటు, ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులను కోరారు. ఆదివారం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం బసవరాజు ఆధ్వర్యంలో ఆదివారం తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో భోజనం, పుస్తకాలు, బ్యాగులు, దుస్తులు, షూస్ ఇస్తామని, నాణ్యమైన విద్య ఉంటుందన్నారు. రహ్మతుల్లా, శశికళ, లతా మంగేశ్వరమ్మ, రమాదేవి ఉన్నారు.



మద్దికెరలో ఇంటింటికి తిరుగుతున్న ఉపాధ్యాయులు

ఉల్లి ఆటో బోల్తా.. మహిళకు గాయాలు

మద్దికెర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గ సమీపాన ఉల్లిగడ్డలతో వస్తున్న ఆటో బోల్తాప డటంతో మహిళకు గాయాలయ్యాయి. వివరాల మేరకు.. మద్దికెరకు చెందిన లక్ష్మి, అలివేలమ్మ అనే మహిళలు గుంతకల్లు నుంచి ఉల్లిగడ్డలు, వెల్లుల్లి కొనుగోలుచేసి వాటిని గ్రామాల్లో విక్రయిస్తుంటారు. రోజు మాదిరిగానే ఆదివారం గుంతకల్లులో సరుకులు తీసుకుని ఆటోలో వస్తుండగా.. బుగ్గ సమీపాన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడి మహిళలు గాయపడ్డారు. ఉల్లిగడ్డలు, వెల్లుల్లి నేలపాల య్యాయి. ప్రమాదానికి కారణమైన వాహా నాన్ని తాము గుర్తించలేకపోయామని మహిళలు వాపోయారు.

రైతుకు సేవ చేయడమే ధ్యేయం

తుగ్గలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రైతుకు సేవ చేయడమే తన ధ్యేయమని ఉప్పర్లపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు అప్పా వేణుగోపాల్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పర్లపల్లిలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఇస్తున్నారన్నారు. తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే శ్యాంబాబుకు ధన్యవాదాలు తెలిపారు. రైతులకు తక్కువ వడ్డీలకే రుణాలు, వ్యవసాయ పరికరాలు కూడా అందిస్తామన్నారు. మనోహర్, సుంకన్న చౌదరి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్

టీడీపీలో బీసీలకు న్యాయం

మద్దికెర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో బీసీలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పారా విఠోభ, విద్యాకమిటీ చైర్మన్ చంద్ర అన్నారు. ఆదివారం మాట్లాడుతూ మద్దికెర సహకార సంఘానికి బీసీ నాయకుడు, మాజీ సర్పంచ్ ఆకుల ఆనంద్‌ను నియ మించడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఉద్యోగాల కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నగేష్

పత్తికొండ టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): యువత ఉద్యోగాలు, ఉపాధి సాధనకు ఉద్యమించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో డీవైఎఫ్ఐ పత్తికొండ ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరిస్తోం దన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపిం చారు. పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేయకుండా సంపన్నులు నివసించే ప్రాం తాల్లో వేస్తున్నారన్నారు. సీపీఎం నాయకులు గంగన్న, రంగడు, సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, యువజన సంఘాల నాయకులు రవి, దుర్గన్న, అశోక్, బాలకృష్ణ, జయప్రకాష్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు గోపాల్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఆదోని అగ్రికల్చర్ జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ ం ఉపాధ్యక్షుడు సి.నాగరాజు, పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. 11వ పీఆర్సీ ముగిసి రెండేళ్లయినా 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రవి ప్రధాన కార్యదర్శి భీమరాజు, జంబులయ్య పాల్గొన్నారు.

నెరణికి తండాలో కార్డన్ సెర్చ్

హొళగుంద జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరణికి తండాలో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ ఆదివారం తెలిపారు. ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నేరణికి, కొత్తపేట గ్రామాల్లో తనిఖీలు చేసి 150 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని, ఒక్కరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలూరు ఎస్ఐ మహబూబ్ బాషా, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మి రామ్ నాయక్, కానిస్టేబుల్‌లు సుధాకర్, పెద్దన్న, గురు ప్రసాద్, రామాంజిని రెడ్డి, శేక్షావలి, జనార్దన్, వెంకటేష్, రాజగోపాల్ పాల్గొన్నారు.



సారా, నిందితుడిని చూపుతుతున్న పోలీసులు

సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దు :సీఐ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ జయన్న

పత్తికొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ జయన్న సూచించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రజలకు అవగాహన కల్పిం చారు. సైబర్ నేరగాళ్లు కొత్తతరహా మోసాలకు తెర తీస్తుంటారన్నారు. ఫోన్లకు వచ్చే ఏపికే ఫైల్స్ ప్రమాదమని, వాటని ఓపెన్ చేయొద్దని సూచించారు. ఓపెన్‌చేస్తే ఫోన్‌డేటా నేరగాళ్ల చేతిలోకి వెళుతుందని నగదు కాజేస్తారన్నారు. బాధితులు త్వరగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

దివ్యాంగులను వేధిస్తున్న ప్రభుత్వం

ఆదోని రూరల్, జూన్ 29 ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తనిఖీ పేరుతో దివ్యాం గులను వేధిస్తోందని వైసీపీ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మొలగవల్లి రామాంజనే యులు ఆరోపించారు. తనిఖీ పేరుతో అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు తొలగించారని, ఏడాది గడిచినా ఇవ్వలేద న్నారు. హనుమంతరెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్, దుగ్గేప్ప, వీరాంజనేయులు పాల్గొన్నారు.



రామాంజనేయులిని సన్మానిస్తున్న నాయకులు

పూర్వ విద్యార్థుల కలయిక



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

హాలహర్వి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల 2006-2007 టెన్త్ బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను సన్మా నించి, నాటి జ్ఞాపకాలను, పాఠశాల తరగతి గదుల్లో కలియ తిరుగుతూ నెమరు వేసుకున్నారు. పాఠశాల అభివృద్ధి, పేద విద్యార్థుల సంక్షేమా నికి తమవంతు సాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లికార్జున, విశ్రాంత హెచ్‌ఎం జయమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అష్టావధానం

పత్తికొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కమలా కళానికేతన్ వారు ఆదివారం అష్టావధానం నిర్వహించారు. నిర్వాహ కుడు సవ్వప్పగారి ఈరన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అష్టావదానానికి జనప్రియకవి ఏలూరి వెంగన్నకవి అధ్యక్షత వహించారు. కేడిసిసి మాజీవైస్‌చైర్మన్ ఎస్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ దంపతులు ప్రారంబించారు. అనంతరం సవ్వప్పగారి ఈరన్న రాసిన విద్యార్థిశతకం పుస్తకాన్ని అరసం జిల్లా ప్రదానకార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ, ఆవిష్కరించారు.



అష్టావధానం పాల్గొన్న వక్తలు

బెల్లం ఊట లారీ దగ్ధం

తుగ్గలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బెల్లం ఊటను రవాణా చేస్తున్న లారీ టైరు నుంచి నిప్పులు అంటుకోవడంతో ఆదివారం లారీ దగ్ధమైంది. వివరాల మేరకు.. మండలలోని జి.ఎర్రగుడి- చెరువుతండా మధ్య ముంబై నసుంచి చెన్నైకు వెళ్తున్న బెల్లం ఊట లారీ రైల్వే వంతెన కింద వెళుతుండగా మంటలు చెలరేగాయి. సమాచారం మేరకు జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున, పోలీసులు, ఫైరింజన్‌తో మంటలు అదుపు చేశారు. కాగా డ్రైవర్, క్లీనర్లకు ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.

తాగునీటి సమస్య పరిష్కారం



కప్పట్రాళ్ల గ్రామంలో వేస్తున్న బోరు

దేవనకొండ, జూన్ 29 (ఆంధ్ర జ్యోతి): తాగునీటి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకు న్నామని టీడీపీ నాయకుడు కప్పట్రాళ్ల మల్లికార్జున అన్నారు. మండలం లోని కప్పట్రాళ్ల గ్రామం చింతమాను వీధిలో తాగునీటి సమస్యను టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ దృష్టికి తీసుకెళ్లడంతో, నిధులు మంజూరు చేయిం చారన్నారు. దీంతో బోరు వేశామని, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. గొర్ల సుంకన్న, నారాయణ, రవికుమార్ ఉన్నారు.

నవోదయం ద్వారా సారా నిర్మూలన

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● పత్తికొండ ఎక్సైజ్ సీఐ సువర్ణలత



పత్తికొండ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నవోదయం 2.0 ద్వారా సారా నిర్మూలనకు కృషిచేస్తున్నామని ఎక్సైజ్ సీఐ సువర్ణలత అన్నారు.

ప్రశ్న: సర్కిల్ పరిధిలో సారా తయారే కేంద్రాలు ఎక్కడెక్కడ ఉన్నాయి?

జవాబు: పత్తికొండ, మద్దికెర, తుగ్గలి మండలాల్లో ఉన్నాయి. వీటిని ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి సారా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడులు చేస్తున్నారా?

జవాబు: ఏ కేటగిరీ కింద జెఎం తండా, పీఎం తండా, రోళ్లపాడు తండా, మద్దికెర ఉన్నాయి. అలాగే బీ కేటగిరీ కింద ఎంఎం తండా, గిడ్డమ్మతండా, బుగ్గతండా, ఎల్లమ్మతండా, బాటతండా, జాఫ్లాతండా, లక్ష్మీతండా ఉండగా, సీ కేటగిరీ కింద తుగ్గలి సారా తయారీ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించాం. నిత్యం దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదుచేస్తున్నాం.

ప్రశ్న: నవోదయం 2.0 కార్యక్రమాల వివరాలు తెలపండి?

జవాబు: ప్రభుత్వం నవోదయం 2.0 ద్వారా సారాను సమూలంగా నిర్మూలించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా గ్రామాల్లో సారా తయారీదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిలో మార్పుకు ప్రయత్నిస్తున్నాం. సారా తయారీ మానుకునేవారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇస్తున్నాం.

ప్రశ్న: నవోదయం 2.0 కంటే ముందు పరిస్థితి ఎలా ఉంది?

జవాబు: నవోదయం 2.0కు ముందు సారా బట్టీలను ధ్వంసం చేయడం, కేసులు నమోదుచేసి రిమాండ్‌కు తరలించడం మాత్రమే చేసేవాళ్లం. కానీ నవోదయం 2.0 లో భాగంగా సారా బట్టీలపై దాడులు చేసి, కేసులు నమోదు చేయడంతో పాటు తయారీదారుల్లో మార్పు కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

మంత్రాలయంలో సినీ నటి ఆమని


కుటుంబ సభ్యులతో ఆమని

మంత్రాలయం, జూన్ 29, (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ప్రముఖ సినీ నటి ఆమని కుటుంబ సమేతంగా ఆదివారం రాత్రి మంత్రాలయంకు వచ్చారు. ఈమెకు మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాస రావు, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహ మూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. రథోత్సవాల ఊరేగింపులో ఆమని పాల్గొన్నారు. పండితులు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వ్యాసరాజ్ ఆచార్, జేపీస్వామి,జయతీర్థ ఆచార్, రాఘవేంద్ర, స్వామిరాయ్, తంబిస్వామి పాల్గొన్నారు.

'కురువలను చిన్న చూపు చూడటం తగదు'

కౌతాళం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధిష్టానం కురువలను చిన్న చూపు చూడటం తగదని కర్నూలు జిల్లా కురువ సంఘం కార్యదర్శి ,కౌతాళం మండల కురువ సంఘం అధ్యక్షుడు కురువ వీరేష్ అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలోని తన స్వగృహంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 7 సహకార సంఘాల సొసైటీలు ఉన్నాయని అయితే ఏ సొసైటీకి కురువ కులస్థులకు అధ్యక్ష పదవులను ఇవ్వకుండా కురువలను అవమానించడం తగదన్నారు. నాయకులు శివకుమార్, రమేష్, బీరప్ప, అనుమేష్ ఉన్నారు.

ఆటో దగ్ధం


కాలిపోయిన ఆటో

పెద్దకడబూరు, జూన్29 (ఆంధ్రజ్యోతి): చిత్తు కాగితాలు తీసుకెళుతున్న ఆటోకు నిప్పురవ్వలు ఎగిరి కాలి బూడిదైన సంఘటన మండల కేంద్రమైన పెద్దకడబూరులోని కేజీబీవి పాఠశాల సమీపంలో జరిగింది. ఆదివారం చిత్తు కాగితాల లోడుతో పెద్దకడబూరు నుంచి ఎమ్మిగనూరుకు వెళ్తున్న ఆటోకు సమీపంలోని కేజీబీవి పాఠశాల దగ్గర చెత్తకు పెట్టిన నిప్పురవ్వలు గాలికి ఆటోపై పడటంతో ఆటో పూర్తిగా కాలిబూడిదైంది. దీంతో దాదాపు రూ 2లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

సొసైటీ అధ్యక్షుడికి సన్మానం


సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నందవరం మండల సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు దర్నాపురం గోపాల్‌ను టీడీపీ నాయకులు ఆదివారం సన్మానించారు. టీడీపీ క్లస్టర్ కాశీంవలీ, వ్యాపారవేత్త రంగయ్య, చిన్నకొత్తిలి సత్యారెడ్డి, తురేగేల్ నజీర్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ సుదీర్, నాగలదిన్నె కిషోర్‌లు శాలువ కప్పి సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌చార్జ్ కాశీంవలీ మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించారని అన్నారు. వచ్చే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా కలసికట్టుగా ఉండి టీడీపీకి కంచుకోటగా ఉన్న నందవరం మండలంలో మెజార్టీ తీసుకురావాలని ఆకాక్షించారు.

అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏసేపు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం తక్షణమే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు, జయన్న డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయకపోవడం కూటమి ప్రభుత్వ విధానాలకు నిదర్శనం అన్నారు. హామీలను అమలు చేయకుంటే ఉద్యమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్, కిష్టన్న, భీమన్న పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఆటోల పార్కింగ్

● ఇబ్బందులు పడుతున్న దుకాణదారులు


తేరుబజారులో దుకాణాలకు అడ్డంగా పార్కింగ్ చేసిన ఆటోలు

కోసిగి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని కోసిగయ్యస్వామి తేరుబజారు మైదానంలో సుమారు 250 వ్యాపార దుకాణాలు ఉన్నాయి. అయితే కొందరు వ్యాపారస్తుల వల్ల దుకాణాలకు అడ్డంగా ఆటోలు నిలబెట్టడంతో దుకాణాదారులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల క్రితమే దుకాణాల బాడుగలు భారీగా పెంచిన వ్యాపారాలు మాత్రం అంతంతగానే ఉన్నాయనీ, అయితే ఎండోమెంటు అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇష్టానుసారంగా ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు వంటి ప్రైవేటు వాహనాలు దుకాణాలకు అడ్డంగా నిలబెడుతున్నారనీ, ఎవరూ కూడా పట్టించుకోవడం లేదని ఆయా షాపుల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆలయ ఈవో దుకాణాలకు అడ్డంగా పెడుతున్న ఆటోల డ్రైవర్లకు హెచ్చరికలు జారీ చేసి తేరుబజారు మైదానంలో వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్లపైనే పార్కింగ్

● ఇరుకు రోడ్డుతో వాహనాల రాకపోకలకు అంతరాయం
● రోడ్ల పైనే వ్యాపారాలు, ఆటోల పార్కింగ్
● వాహనదారులకు తప్పని తిప్పలు


వాహనాలు నిలపడంతో దారిలో చిక్కుకున్నవాహనాలు


పాతబస్టాండ్ బ్యాంక్ దగ్గర రహదారిపై నిలిపిన వాహనాలు

గోనెగండ్ల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రోడ్ల విస్తరణ కార్యక్రమాలు చేపట్టక పోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. ప్రతి రోజు వేలాదివాహనాలు తిరిగే ప్రాంతాలలో రోడ్డు కు ఇరువైపులా వాహనాల నిలపడంతో వాహనాల రాక పోకలకు ఇబ్బంది గా మారుతుంది. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్య కారణంగా మండల కేంద్రమైన గోనెగండ్ల గ్రామాలలోని ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారి లో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు ఇబ్బందిగా మారుతుంది. దీంతో వాహనాల రాక పోకలకు అంతరాయ ఏర్పడుతుంది. పెరుగుతున్న వాహనాల రద్దికి తగ్గట్టుగా అధికారులు చర్యలు తీసుకోక పోవడం వల్ల సమస్య మరింత జటిలమవుతుంది. బస్టాండ్, పాత బస్టాండ్, ప్రాంగణం నందు ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయడం, రోడ్ల పైనే వ్యాపారాలు నిర్వహించడం వల్ల ప్రతి రోజు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది.

28 గ్రామాలకు కేంద్రంగా..

కర్నూలు, మంత్రాలయం, బళ్లారి, ఆదోని హైద్రాబాద్, తిరుపతి, ప్రాంతాల వైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకల కారణంగా ఈ రోడ్డు ఎప్పుడు రద్దీగా ఉంటుంది. గోనెగండ్ల లో ఈ ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. 28 గ్రామాలకు చెందిన ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే గోనెగండ్ల, లేదా హెచ్ కైరవాడి గ్రామలాకు చెందిన బస్టాండ్ ల ను ఆశ్రయించాల్సి ఉంది. ఈ గ్రామాలలో బస్టాండ్ ఉన్నా లేనట్టే అనే విధంగా ఉంటుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రోడ్లు పైనే నిలబడాల్సివస్తుంది.

నిత్యం వాహనాల రద్దీ:

ఈ గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సులు, ట్రాక్టర్లు, ఇసుక ను తరలించే వాహనాలు, ఇతర ప్రవేట్ వాహనాలు, నిత్యం సంచరిస్తుంటాయి. దీనికి తోడు గా వందలాది ఆటోలు ఇబ్బడి ముబ్బడిగా తిరుగుతుంటాయి. ఎక్కువ సంఖ్యలో వాహనాలు తిరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతుంది. కోడుమూడు, ఎమ్మిగనూరు ప్రాంతాలకు వెళ్లే ఆటోలు రోడ్ల పైనే పార్కింగ్ చేస్తుండటతో మరింత ఇబ్బందిగా మరింది. దుకాణాల దగ్గర ద్విచక్రవాహనాలను ఉంచడం తో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగింది.

రోడ్లను ఆక్రమించి అద్దెలకు :

మండల కేంద్రంలో అనేక చోట్ల రోడ్లపైనే వ్యాపారాలు చేస్తున్నారు. ఎమ్మిగనూరు, కర్నూలు, తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారి లో ఉన్న షాపుల యజమానులు తమ షాపులతో పాటు ముందు ఉన్న ఆర్అండ్‌బీ స్థలంను ఆక్రమించి చిరు వ్యాపారులకు అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. గోనెగండ్ల లోని ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న స్థలంను ఆద్దెలకు ఇవ్వడంతో రోడ్డు ఇరుకుగా మరిపోయింది. దీంతో వాహనాల రాక పోకలకు ఇబ్బందిగా మారింది. ఏ సమయంలో ఏవాహనం వెనక వైపునుంచి వచ్చి ఢీకొడుతుందో తెలియక వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాంద్ టాకీస్ క్రాస్‌రోడ్డు, ఆసుపత్రిక్రాస్‌రోడ్డు, గంజహళ్లి క్రాస్ రోడ్డు దగ్గర ఏ వైపు నుంచి ఏ వాహనం ఎప్పుడు దూసుకువచ్చి ఢీ కొడుతుందో అనే భయం వెంటాడుతుంది. ఈ కూడళ్లలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటలను కూడా చాల ఉన్నాయి. పెద్ద వాహనాలు వస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. వాహనాలు ఎక్కడివి అక్కడే నిలిచిపోతాయి. ఒక్కో సారి అంబులెన్స్ లకు కూడ దారి ఇవ్వని పరస్థితి ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

వ్యాపారులతో ఇబ్బందిగా ఉంది



వ్యాపారాలు చేసుకునేవారు ఆర్అండ్‌బీ స్థలాన్ని వదిలి వ్యాపారం చేసుకోవాలి. రోడ్డు స్థలంలో వ్యాపారాలు చేస్తుండటంతో రోడ్డు మీద వెళ్లే వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయ ఏర్పడుతుంది. అధికారులు ఈ విషయం పై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలి.

-రాయుడు, గోనెగండ్ల.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



అధికారులు చొరవ తీసుకొని గోనెగండ్లలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను వెంటనే పరిష్కరిం చాలి. గ్రామాలకు పట్టణాలకు వెళ్లే ఆటోలు ద్వార సమస్యలు రాకుండా చూడాలి. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించేవిధంగా చర్యలు తీసుకోవాలి.

- నాగరాజు, మాజీ సర్పంచ్, పిల్లిగుండ్ల

పీఠాధిపతికి 'అభినవ పరిమళాచార్య' బిరుదు


అవార్డు అందుకుంటున్న పీఠాధిపతి

మంత్రాలయం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులకు 'అభినవ పరిమళాచార్య' అనే అత్యున్నత బిరుదును ఉడిపి పుట్టిగే మఠం పీఠాధిపతులు సుజ్ఞానేంద్ర తీర్థులు, సుశ్రీంద్ర తీర్థులు ప్రదానం చేశారు. ఉడిపి మఠంలో బంగారు రథం నిర్మాణానికి మంత్రాలయం మఠం నుంచి రూ.10 లక్షల నగదును పీఠాధిపతి విరాళంగా అందజేశారు.

● పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటనలో బాగంగా ఆదివారం కర్నాటకలోని ఉడిపిలో వెలసిన శ్రీకృష్ణ స్వామిని దర్శించుకున్నారు. ఉడిపి అధికారులు, పండితులు పీఠాధిపతికి ఘనంగా స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేసిన మంత్రాలయం పీఠాధిపతి బంగారు గొలుసును విరాళంగా ఇచ్చారు. రాజా ఎస్ అప్రమేయాచార్, ఉడిపి రంగాచార్, ద్వారపాలక అనంతస్వామి, సురేంద్రాచార్, ప్రకాష్‌ఆచార్, పవన్‌ఆచార్, తదితరులు పాల్గొన్నారు.

'ఈ ప్రభుత్వంతోనే ఎస్టీ బిల్లు సాధ్యం'


మాట్లాడుతున్న లక్ష్మన్న

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వాల్మీకుల ఎస్టీ బిల్లు ఈ ప్రభుత్వం ద్వారానే సాధ్యమని, ఎస్టీ బిల్లు త్వరలో పాస్ అవుతుందని రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రాలయం జనసేన పార్టీ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న అన్నారు. ఆదివారం బిర్లా కాంపౌండులోని సంఘం కార్యాలయంలో వాల్మీకి సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. లక్ష్మన్న మాట్లాడుతూ వాల్మీకుల పోరాటాల వల్లనే వాల్మీకి జయంతిని కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రభుత్వమే నిర్వహించే విధంగా జీవో పాస్ చేయించామన్నారు. వాల్మీకి ఎస్టీ బిల్లు గురించి రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదేండ్ల మనోహర్‌ను కలిశామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగ్గాపురం చిన్న ఈరన్న, వైద్యులు భవాని ప్రసాద్, కుబేరస్వామి, బడన్న, రంగనాయకులు, జిల్లా అధ్యక్షుడు అర్జున్, రామక్రిష్ణ, బేతం కృష్ణ, తలారి కృష్ణ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చే వరకు పోరాటం

● పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి ● సీపీఐ మహాసభలో నాయకులు


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెవర్చే దాకా పోరాటం ఆగదని సీపీఐ నాయకలు అన్నారు. ఎమ్మిగనూరులో ఆదివారం 11వ నియోజకవర్గ ప్రతినిధుల మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య మాట్లాడుతూ ఎంతో మంది కార్మికులు, కర్షకులు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలతో ఇబ్బందులకు పడుతున్నారన్నారు. రైతులకు బ్యాంకు రుణాలు, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతుల ఆత్మహత్యలు నివారించాలన్నారు. మహాసభకు దాదాపు 500 మందికి పైగా సీపీఐ కార్యకర్తలు, సీపీఐ అనుబంధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ముందుగా స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుంచి వైఎస్ఆర్, సోమప్ప సర్కిల్ మీదుగా స్థానిక కుర్ణీ కళ్యాణ మంటపం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ముందు భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల వేషధారణలతో యువకులు ఆకట్టుకున్నారు. డప్పు కళాకారులు గుంపుగా ఏర్పడి డప్పులను వాయిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కుర్ణీ కల్యాణ మంటపానికి చేరుకున్నారు. జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ దేశంలో దారిద్ర్యరేఖకు దిగువన 30 శాతం మంది ఉన్నారని అన్నారు. మోదీ ప్రభుత్వం దేశాన్ని హిందూదేశంగా మార్చేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. దేశాన్ని లౌకిక దేశంగా ఉండేలా కమ్యూనిస్టు పార్టీలు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పేదల కోసం లక్షలాది ఎకరాలను పేదలకు పంచిపెట్టిన ఘనత సీపీఐకు దక్కిందన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, పట్టణ కార్యదర్శి రంగన్న, పంపన్నగౌడు, భాస్కర్‌యాదవ్, తిమ్మగురుడు, విజయేంద్ర, భాస్కర్‌యాదవ్, రాజీవ్, మహిళలు, యువకులు, కార్మికులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

ఇంటి వద్దకే రేషన్

కోసిగి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 60 ఏళ్ల పైబడిన వృద్దులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ డీలర్లు రేషన్ తీసుకెళ్లి అందజేయాలని ఆదేశాలు ఇవ్వడంతో జూలై నెలకు సంబంధించిన నెల సరుకులు ముందుగానే 60 ఏళ్ల పైబడిన వృద్దులు, దివ్యాంగుల ఇళ్లవద్దకు వెళ్లి రేషన్ సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. ఆదివారం కోసిగితో పాటు అన్ని గ్రామాల్లో రేషన్ డీలర్లు వృద్ధులకు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకు వెళ్లి ఈపోస్ మిషన్‌లో బయోమెట్రిక్ వేయించుకుని బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ రేషన్‌డీలర్లు సక్రమంగా రేషన్ సరుకులు దివ్యాంగులకు, వృద్దులకు సరుకులు అందించాలని ఆదేశించారు.

సింగిల్ విండో చైర్మన్ ఎంపిక


తిమ్మారెడ్డి

గోనెగండ్ల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండల హెచ్ కైరవాడి వ్యవసాయ ప్రాథమిక సహకారం సంఘం చైర్మన్‌గా బురుజుకాటి తిమ్మారెడ్డి ఎంపికయ్యారు. సంబంధిత ఎంపిక పత్రం జిల్లా సహకారం సంఘం ఉన్నతాధికారుల నుంచి అందినట్లు హెచ్ కైరవాడి సంఘం అధికారులు తెలిపారు. హెచ్ కైరవాడి సొసైటీకి అధ్యక్షుడిగా తిమ్మారెడ్డి, కమిటీ సభ్యులుగా పెద్దనేలటూరు గ్రామానికి చెందిన ఎం ఆనందం, పుట్టపాశం గ్రామానికి చెందిన బీటీ పెద్దవెంకటరాముడిని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎంపిక చేశారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

● అతి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్న ప్రయాణికులు



కొటేకల్లు సమీపంలో అతిప్రమాదకరంగా ఉన్న మలుపులు

ఎమ్మిగనూరు రూరల్, జూన్29(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని పలుచోట్ల ఉన్న మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. కొన్ని చోట్ల రోడ్డు సక్రమంగా లేకపోవడం.. మరికొన్ని చోట్ల పూర్తి మలుపులు ఉండడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఒకటికొకటి ఢీకొని ప్రయాణికులు తమ ప్రాణాలమీదుకు తెచ్చుకోవడమేగాక కొంతమంది ప్రాణాలమీదకు కూడా తెస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మిగనూరు మండలంలోని కొటేకల్లు సమీపంలో ఉన్న పెద్ద మలుపులు వద్ద నెలలో నాలుగు నుంచి ఐదు ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో ఎంతో మంది ప్రయాణికులు క్షతగాత్రులు కావడమేగాక కొంతమంది ప్రాణాలను కూడా కోల్పోయారు. దీంతో ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. ఎర్రకోట సమీపంలోని సబ్‌స్టేషన్, కె. తిమ్మాపురం, మల్కాపురం, గుడికల్లు, సంతనాగలాపురం, కడివెళ్ల గ్రామాల్లో ఉన్న మలుపుల ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటుంది.

ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడం వలనే:

కొటేకల్లు, ఎర్రకోట, కె . తిమ్మాపురం, గుడికల్లు రహదారుల్లో ఉన్న మలుపులు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రహదారుల్లో నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో పాటు భారీ వాహనాలు ప్రయాణం చేస్తునే ఉంటాయి. ఈ మలుపుల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్లే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు వాపోతున్నారు.

నిత్యం ఏదో ఒక ప్రమాదం



కొటేకల్లు మలుపు అతి ప్రమాదకర మలుపుగా మారింది. ఈ మలుపులో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతునే ఉంటుంది. నెలలో దాదాపు 5 నుంచి 6 వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇక్కడ ప్రమాద హెచ్చరిక సూచించే బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-రాముడు, ద్విచక్రవాహనదారుడు, దేవిబెట్ట

ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మలుపులు ఉన్న చోట్ల ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రోడ్డుపై పెద్దపెద్ద వాహనాలు అతివేగంగా రావడం, మలుపులు ఉన్న దగ్గర కూడా స్పీడ్‌ను తగ్గించుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద రాత్రివేళల్లో కూడా మలుపులను సూచించేలా రేడియం వంటి వాటితో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

- అమిద్, కొటేకల్లు, ఆటో డ్రైవర్

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం



ప్రమాదాలు జరిగే చాలా చోట్ల హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశాం. కర్నూలు రహదారిలోని బాట మారెమ్మవ్వ సమీపంలో ప్రమాదాలు అధికంగా జరుగుతుండడంతో రోడ్డుకు అటువైపు.. ఇటువైపు హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశాం. రోడ్డు ప్రమాదంలో ఎవరైనా ఓ వ్యక్తి మరణిస్తే వారి కుటుంబం ఎలా చిన్నాభిన్నమవుతుందనే విషయాలను వాహనదారులకు తెలియజేస్తున్నాం.

-శ్రీనివాసులు, ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ